ఎల్ఆర్ఎస్‌కు అత్తెసరు ఆదరణ

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) లే అవుట్ రెగ్యులరైజేషన్ పథకానికి జీహెచ్ఎంసీ పరిధిలో అత్తెసరు ఆదరణ వచ్చింది. మొత్తం 107872 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా, తాజా నోటిఫికేషన్ ప్రకారం 59564 దరఖాస్తుదారులకు ఫీజు ఇంటిమేషన్ జారీ చేయగా మార్చి 29 నాటికి 7891 మంది మాత్రమే ఫీజులు చెల్లించగా ఇప్పటివరకు 103.46 కోట్ల ప్రభుత్వ ఖజానాకు చేరినట్లుగా జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. అయితే మార్చి 31వరకు 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించుకునే అవకాశం కల్పించినా జనాల నుంచి స్పందన లేకపోవడం గమనార్హం.

లోకల్ బాడీ ఎమ్మెల్సీకి ఒక్క నామినేషన్

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచేందుకు రెండో రోజున ఒక్క నామినేషన్ దాఖలైంది. దమ్మాయిగూడకు చెందిన కంటె సాయన్న స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసేందుకు నామినేషన్ పత్రాలను జీహెచ్ఎంసీ ఎన్నికలాధికారికి సమర్పించారు. మార్చి 28న షెడ్యుల్ విడుదల కాగా, ఏప్రిల్ 4 వరకు నామినేషన్లు సమర్పించేందుకు గడువు ఉంది. కాగా ఏప్రిల్ 7న నామినేషన్ల పరిశీలన, ఏప్రిల్ 9న ఉపసంహరణకు ఆఖరు తేదీగా రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

ఉగాది, రంజాన్ వేడుకలకు కట్టుదిట్టమైన చర్యలు: కమిషనర్ సుధీర్ బాబు

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ) : ఉగాది, రంజాన్ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలని రాచకొండ కమిషనర్ ప్రజలకు సూచించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా జోనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎన్నో సున్నితమైన ప్రదేశాలు ఉన్నాయని, ఉగాది మరియు రంజాన్ వేడుకల సమయంలో ఎటువంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ముస్లింలు భారీ సంఖ్యలో పాల్గొనే సామూహిక ప్రార్థనల వంటి కార్యక్రమాల బందోబస్తు సమయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని, ఇప్పటికే అవసరమైన మేరకు రిజర్వు పోలీసులను కూడా పోలీస్ స్టేషన్ విధులకు కేటాయించడం జరిగింది కాబట్టి వారిని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు.

రూ.43.15 కోట్ల లోటుతో ఓయూ బడ్జెట్

సెనేట్ సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న ప్రొఫెసర్ చింత సాయిలు

వార్షిక నివేదికను సమర్పిస్తున్న ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, చిత్రంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ 2025-26 ఆర్థిక సంవత్సరానికి చెందిన వార్షిక బడ్జెట్ ను శనివారం నిర్వహించిన అకాడమీ సెనేట్ సమావేశంలో ప్రవేశపెట్టారు. ఓయూ బడ్జెట్లో మొత్తం ఆదాయం రూ.750.81 కోట్లుగా చూపెట్టారు. గత ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి రూ.21.73 కోట్ల ఓపెనింగ్ బ్యాలెన్స్ కలిపి మొత్తం రూ.772.54 కోట్ల నిధులు అందుబాటులో ఉండగా, వ్యయం రూ.815.69 కోట్లుగా చూపెట్టారు. రూ.43.15 కోట్ల లోటుతో బడ్జెట్ ను ఆమోదించారు. ఇందులో ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ రూ.542.68 కోట్లు, మిగిలిన నిధులను యూనివర్సిటీ అంతర్గతంగా సమకూర్చుకోనుంది. ఓయూ పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్లో నిర్వహించిన అకాడమిక్ సెనేట్ సమావేశంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదికను చదివి వినిపించారు. ఈ నివేదికలో గత ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన అభివృద్ధి పనులు, తీసుకున్న ప్రత్యేక చర్యలు తదితర వాటిని వివరించారు. యూనివర్సిటీ నిర్వహించనున్న కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ల గురించి పేర్కొన్నారు. సాధారణంగా బడ్జెట్ ను సీనియర్ ప్రొఫెసర్లలో ఒకరు ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఈ ఏడాది ఓయూ టెక్నాలజీ విభాగం సీనియర్ ప్రొఫెసర్, టీఎస్ పీఎస్సీ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ చింత సాయిలు బడ్జెట్ ను ప్రవేశపెట్టారు. బడ్జెట్ ప్రవేశపెడుతుండగా మధ్యలో ప్రొఫెసర్ సాయిలు ఒక్కసారిగా కుప్పకూలారు. దీంతో ఆయనను హుటాహుటిన సమీపంలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ఆయన బ్రెయిన్ స్ట్రోక్ కు గురయ్యారని, చికిత్స ప్రారంభించినట్లు వైద్యులు తెలిపారు. మిగిలిన బడ్జెట్ ప్రసంగాన్ని మేనేజ్మెంట్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ శ్రీరాములు పూర్తి చేశారు. సభ్యులు ఏకాభిప్రాయంతో బడ్జెట్ ను ఆమోదించారు. ఓయూకు ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం నుంచి రూ.542.68 కోట్ల బ్లాక్ గ్రాంట్ మంజూరుకాగా, గతేడాది ఓపెనింగ్ బ్యాలెన్స్ రూ.21.73 కోట్లు, ఇందులో రూ.35.63 కోట్లు అంతర్గత ఆదాయాల ద్వారా, ఎగ్జామినేషన్ బ్రాంచ్, యూనివర్సిటీ ఫారెన్ రిలేషన్స్ ఆఫీస్, పీజీ ఆర్ఆర్ సీడీఈ, డైరెక్టరేట్ ఆఫ్ పీజీ అడ్మిషన్స్, డైరెక్టరేట్ ఆఫ్ అకాడమిక్ ఆడిట్, టీఎస్పీజీఈటీ కన్వీనర్ తదితర సంస్థల నుంచి నిధుల మళ్లింపు ద్వారా రూ.168.50 కోట్లు, లోన్లు, అడ్వాన్సుల వసూల ద్వారా రూ.4.00 కోట్లు సమకూర్చుకుంటామని పేర్కొన్నారు. మొత్తం బడ్జెట్లో అధ్యాపకులు, ఉద్యోగుల వేతనాలకు రూ.453.91 కోట్లు కాగా, పెన్షన్లకు రూ.310.00 కోట్లు కేటాయించారు. అదేవిధంగా ఆకస్మిక అవసరాలకు రూ.47.78 కోట్లు, ఉద్యోగుల లోన్లకు రూ.4.00 కోట్లు కేటాయించారు.

బడ్జెట్లో సింహభాగం వేతనాలు, పెన్షన్లే...

యూనివర్సిటీ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్లో సింహభాగం ఉద్యోగుల వేతనాలు, పదవీ విరమణ చేసిన వారి పెన్షన్లకే సరిపోతోంది. ఉద్యోగుల వేతనాలకు రూ.458.91 కోట్లు అవసరముండగా, ఇది వర్సిటీ మొత్తం బడ్జెట్లో 55.65 శాతం కావడం గమనార్హం. అదేవిధంగా పెన్షన్లకు మరో రూ. 310.00 కోట్లు కేటాయించగా, ఇది 38.00 శాతంగా ఉంది. మిగిలినదాంట్లో 5.86 శాతం కాంటింజెన్సీకి, 0.49 శాతం ఉద్యోగుల రుణాలకు కేటాయించారు. అయితే వేతనాలు, పెన్షన్లకు మొత్తం బడ్జెట్లో 98.65 శాతం పోలింది. 2015-18 ఆర్థిక సంవత్సరంలో ఈ శాతం 65.75గా ఉండగా, ఉద్యోగులకు వేతనాలు పెరిగిన దృష్ట్యా వర్సిటీ పై మరింత భారం పడింది.

వర్సిటీ అభివృద్ధికి బ్లాక్ గ్రాంట్ పెంపే శరణ్యం

ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ వర్సిటీ అధ్యాపకులు, ఉద్యోగుల జీతభత్యాలకు కూడా సరిపోని పరిస్థితి ఉండడంతో యూనివర్సిటీ ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు లేకుండా ఎక్కడి వేసిన గొంగడి అక్కడే చందంగా తయారైందని పలువురు సీనియర్ అధ్యాపకులు వ్యాఖ్యానిస్తున్నారు. తక్షణమే ప్రభుత్వం అందించే నిధులను పెంచాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. సరిపోను నిధులు ఉన్నప్పుడే వర్సిటీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, పరిశోధనలను విస్తృతం చేయవచ్చని వివరిస్తున్నారు. సాధారణంగా యూనివర్సిటీ వేతనాలు, పెన్షన్లకు అవసరమైన నిధులను ప్రభుత్వం బ్లాక్ గ్రాంట్ రూపంలో మంజూరు చేయాలని సూచించారు.

ఇమ్యునైజేషన్‌లో భాగంగా నాలుగు టీకా వాహనాలు

జెండా ఊపి టీకాల వాహనాలను ప్రారంభిస్తున్న డా.వెంకటి

సిటీబ్యూరో, మార్చి 29(నమస్తే తెలంగాణ): ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా హైరిస్క్ ఉన్న ప్రాంతాల్లో ఉన్న పిల్లలకు టీకాలు వేయడం కోసం ప్రత్యేకంగా నాలుగు టీకా వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డా.వెంకటి శనివారం ఈ టీకా వాహనాలను జెండా ఊపి ప్రారంభించారు. మురికివాడలు, సమస్యాత్మక ప్రాంతాలున్న ఖైరతాబాద్ యూపీహెచ్‌సీకి చెందిన ఎఎన్ఎం లావణ్య, మెట్టుగూడ ఎఎన్ఎం శైలజ, శ్రీరామ్‌నగర్ ఎఎన్ఎం రజిత, సనత్‌నగర్ ఎఎన్ఎం ప్రమీలకు హోండా యాక్టివా వాహనాలను అందచేశారు.

గ్రేటర్ @ 38.2డిగ్రీలు

సిటీబ్యూరో, మార్చి 29 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. దీంతో ఉక్కపోత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ట ఉష్ణోగ్రతలు 38.8డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 26.0డిగ్రీలు, గాలిలో తేమ 27శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా రాగల రెండు రోజులు నగరంలో అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోతే..

- కాంగ్రెస్‌పార్టీని బొందపెడుతాం
- కేసీఆర్ హయాంలో లంబాడీలకు స్వర్ణయుగం
- ఎస్సీ,ఎస్టీ,బీసీ రాష్ట్ర విద్యార్థి సంఘం అధ్యక్షుడు నరసింహానాయక్

మాట్లాడుతున్న నరసింహానాయక్

రవీంద్రభారతి, మార్చి29 రాబోయే రోజుల్లో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో లంబాడీ శాసనసభ్యులకు మంత్రి పదవి ఇవ్వకపోతే కాంగ్రెస్ పార్టీని తండా పొలిమెరాల్లో కూడా రానివ్వమని ఎస్సీ,ఎస్టీ,బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నరసింహానాయక్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా శనివారం బషీర్‌బాగ్‌లో నరసింహానాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యం తెస్తాం లంబాడీల ఆత్మగౌరవాన్ని పెంచుతామని చెప్పి ఓట్లతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి లంబాడీలకు తీరని అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. లంబాడీల కంటే జనాభా తక్కువ ఉన్న ఓ వర్గానికి ఐదు మంత్రి పదవులు, 20కి పైగా కార్పొరేషన్ పదవులు కట్టబెట్టారని, 10 శాతం ఉన్న లంబాడీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇవ్వకపోవడం లంబాడీ జాతిని అవమానించడమేనని, 60 నియోజకవర్గాలలో అత్యధికంగా లంబాడీలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి అధికారంలోకి తీసుకువచ్చిన లంబాడీలకు ఒక్క మంత్రి పదవి కూడా ఇక్వపోవడం ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన లండాలను గుర్తించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మంత్రి వర్గ విస్తరణలో లంబాడీలకు స్థానం కల్పించారని, చందులాల్, సత్యవతి రాథోడ్‌కు చోటు కల్పించిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. కేసీఆర్ హయాంలో లంబాడీలకు స్వర్ణయుగంగా ఉండేదని ఆయన స్పష్టం చేశారు. మాయమాటలు చెప్పి ఓటువేసినందుకు లంబాడీలకు కాంగ్రెస్‌పార్టీ వెన్నుపోటు పొడిందన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ లంబాడీల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. కాంగ్రెస్‌పార్టీని నేతలను తండాల్లోకి రానివ్వకుండా అడ్డుకుంటామని నరసింహానాయక్ హెచ్చరించారు.

ఉగాది పండుగను పురస్కరించుకుని శనివారం మోండా మార్కెట్‌లో పచ్చడి కోసం మామిడి కాయలను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఇంజినీరింగ్ భవిష్యత్తును మలిచే ప్రయాణం

ఉన్న విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్‌రెడ్డి తదితరులు

మేడ్చల్, మార్చి 29 : ఇంజినీరింగ్ భవిష్యత్తును మలిచే ప్రయాణమని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ కిష్టాపూర్‌లో ఉన్న వార్షికోత్సవం, టెక్నికల్, నాన్‌టెక్నికల్ ఈవెంట్ల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అంటే కేవలం కోర్సు కాదని, భవిష్యత్‌ను నిర్ణయించే ప్రయాణం అన్నారు. మార్కెట్లోకి వస్తున్న కొత్త కొత్త సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించేందుకు కృషి చేయాలన్నారు. కృత్రిమ మేధ ప్రపంచ గమనాన్ని మార్చేస్తుందన్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం ప్రతి రంగంలో ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు కృత్రిమ మేధపై లోతుగా అధ్యయనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్ రెడ్డి, కార్యదర్శి కిష్టారెడ్డి, కల్నల్ నరేందర్ రెడ్డి, కళాశాల సలహాదారు సత్యనారాయణ, డైరెక్టర్లు సుబ్బరత్నం, వేముల రాఘవేందర్ రెడ్డి, భరతసింహా రెడ్డి, హెడ్ ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓలా, ఊబర్, రాపిడోల శ్రమదోపిడీని అరికట్టాలి

కవాడిగూడ, మార్చి 29 ఓలా ఊబర్ రాపిడో సంస్థలు చేస్తున్న శ్రమదోపిడీని తక్షణమే అరికట్టాలని తెలంగాణ క్యాబ్ డ్రైవర్ల జేఏసీ చైర్మన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. హక్కుల సాధనకోసం, తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ క్యాబ్ డ్రైవర్ల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్కు వద్ద క్యాబ్ డ్రైవర్లు నిరసన ధర్నా చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఓలా, ఊబర్, రాపిడో, వైట్‌ప్లేట్, టూవీలర్లను వెంటనే నిషేధించాలని, యాప్ సంస్థలను భిహిష్కరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఆర్టీవో చట్టానికి విరుద్దంగా వ్యాపారం కొనసాగిస్తున్న ఇతర రాష్ట్రాల ట్యాక్సీ ప్లేట్ వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ క్యాబ్ డ్రైవర్ల జేఏసీ నాయకులు సాగర్, వినోద్, సాయికిరణ్, గంగాధర్, రమేష్, హనుమంతు, బాబ్జి, శ్రీకాంత్, రాజు, ప్రభాకర్, శ్రీనివాస్, జానయ్య, రామ్, అమీర్, ఆనంద్, సత్యానారాయణ, అజయ్ పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జేఏసీ నాయకుడు

ఒకే కాన్పులో నలుగురు పిల్లలు జననం

తల్లిపిల్లలు క్షేమం

ఆరోగ్యంగా ఉన్న పిల్లలను వారి కుటుంబ సభ్యులకు అందజేస్తున్న దవఖాన సూపరింటెండెంట్ రవికుమార్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 29 నీలోఫర్ దవఖానలో ఓ మహిళ ఒకే కాన్పులో నలుగురు పిల్లలకు జన్మనిచ్చింది. నగరంలోని హస్తినాపురానికి చెందిన అమృత(24) గర్భం దాల్చడంతో నీలోఫర్ దవఖానలో ఫిబ్రవరి 22న అడ్మిట్ చేశారు. నెలలు నిండని అమృతకు అదేరోజు నొప్పులు రావడంతో 7వ నెలలోనే సిజేరియన్ చేసిన వైద్యులు తక్కువ బరువుతో ఇద్దరు మగ పిల్లలు ఇద్దరు ఆడపిల్లలు జన్మించారని సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. కాగా పిల్లలు నెలలు నిండకముందే పుట్టడంతో పలు ఆరోగ్య సమస్యలతో ఉండడంతో నియోనటలాజీ డిపార్ట్‌మెంట్ హెచ్ఓడి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.స్వప్న పర్యవేక్షణలో ఐసీయూలో వెంటిలేటర్‌పై వైద్య అందించారు. ప్రస్తుతం పిల్లలు ఆరోగ్యంగా ఉండడంతో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న భగవాన్ ప్రసాద్

ఖైరతాబాద్, మార్చి 29 : రాష్ట్రంలో జరిగే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు మంత్రి పదవి ఇవ్వాలని మాదిగ ఇంటలెక్చువల్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు చింతా భగవాన్ ప్రసాద్ డిమాండ్ చేశారు. మాదిగ సంఘాలు, ఉద్యోగ జేఏసీ, ఇంటలెక్చువల్ ఫోరం సంయుక్తాధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఏపీ,ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు అన్యాయం జరుగుతుందన్నారు. 18 శాతం ఉన్న దళితుల్లో 10 శాతం మాదిగలు, ఎనిమిది శాతం మాలలున్నారన్నారు. జనాభా దామాషా ప్రకారం ఎస్సీలకు కనీసం రెండు మంత్రి పదవులు రావాలన్నారు. కాని అది ఎక్కడా ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్ఆర్ మోహన్, ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఇప్పూ యూనివర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పన్నులు మనవి.... నిధులు ఉత్తరాది వారికా...?

- నిష్పక్షపాతంగా కేటాయింపులు ఉండాలి
- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దిడ్డి సుధాకర్

సమావేశంలో మాట్లాడుతున్న దిడ్డి సుధాకర్

ఖైరతాబాద్, మార్చి 29: కేంద్ర ప్రభుత్వం దక్షిణ భారతదేశంలో డీలిమిటేషన్ కాకుండానే భారీగా పన్నులు కట్టించుకొని నిధుల కేటాయింపులు మాత్రం ఉత్తరాది రాష్ట్రాలకు చేస్తోందని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాల్లో జీఎస్టీ, సీజీఎస్టీ పేరిట పెద్ద ఎత్తున పన్నులను వసూలు చేస్తున్నారని, కాని ఇచ్చే విషయాన్ని వచ్చే సరికి కేటాయింపుల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దశాబ్దాలుగా ఇదే తంతు సాగుతుందని, తాజాగా మళ్లీ డీలిమిటేషన్ పేరుతో అన్యాయాన్ని సిద్ధమవుతున్నారన్నారు. ఉత్తర భారతదేశంలో పార్లమెంట్ స్థానాలు ఇష్టారాజ్యాంగ పెంచుకొని, ఈ ప్రాంతాలకు మాత్రం మొండి చేయిచూపించే కార్యచరణ రూపొందిస్తున్నారన్నారు. గత ఏడాది జరిగిన బీహార్ ఎన్నికల్లో స్వయంగా ప్రధాన మంత్రి స్వయంగా ఆ రాష్ట్రానికి ఎన్ని నిధులు కావాలో బహిరంగ వేల ప్రకటనలా ఎన్నికల ప్రచారంలో అక్కడి ప్రజలను అడగడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. డీలిమిటేషన్ విషయంలో దక్షిణ భారతదేశంలోని అన్ని పార్టీలు, ప్రభుత్వాలను కలుపుకొని పోరాడుతామన్నారు. ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, సీపీఐ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఎంఆర్ వినోద్ రెడ్డి, ప్రొఫెసర్ మధుసూదన్ రెడ్డి, జగన్, రామరాజు పాల్గొన్నారు.

అందాల పోటీలను ప్రతిఘటిద్దాం

మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక

చిక్కడపల్లి, మార్చి 29 : మిస్ వరల్డ్ అందాల పోటీలను ప్రతిఘటించాలని పలువురు మహిళా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మిస్ వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక వేదిక ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అందాల పోటీలపై సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా రచయిత్రి జూపాక సుభద్ర, పి ఓడబ్ల్యూ జాతీయ నాయకురాలు సంధ్యలు మాట్లాడుతూ ప్రపంచ సుందరి పోటీలు 2025 మే నెలలో హైదరాబాదులో జరగనున్నట్టు తెలంగాణ టూరిజం ,హెరిటేజ్ మరియు సాంస్కృతిక శాఖ ప్రకటించింది . మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధినేత జూలియా మెర్లీ తదితరులు తెలంగాణ కు ముఖ్యంగా హైదరాబాదుకు ఉన్న ఘన చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను పరిగణలోకి తీసుకొని అందాల పోటీలకు వేదికగా నిర్ణయించామని ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రదర్శనకు కోట్లాది రూపాయలను కేటాయిస్తూ ఇది రాష్ట్రానికి చాలా లాభదాయకమని రెవెన్యూ జనరేటింగ్ ప్రాజెక్ట్ అని దండోరా వేస్తున్నారని విమర్శించారు. అందాల పోటీల మీద పెట్టే ఖర్చుతో గ్రామీణ హాస్టలల్లో, పాఠశాలల్లో మంచినీళ్లు , టాయిలెట్ సౌకర్యాలను, వైద్య సౌకర్యాలను, చారిత్రక ప్రదేశాలలో వసతులను, భద్రతను మెరుగుపరచవచ్చన్నారు. ఈ సమావేశంలో వివిధ మహిళా సంఘాల నాయకులు అనసూయ, ఆశాలత, స్వరూప, జ్యోతి , శ్రీదేవి,లావణ్య స్త్రీవిముక్తి, శాంత, జ్యోతి,జయ, జి.ఝాన్సీ, ప్రదీప్, జాన్, మహేష్, సత్య, తేజ, జ్యోతి వహీద్, అంబిక, అనిల్, సరిత, గిరిజ, జాన్,శివ బాబు, హేమలత , మమత ,అరుణ ,మల్లు లక్ష్మి, శిరోమణి, జయ, సంధ్య, ఝాన్సీ, ప్రదీప్, జాన్, మహేష్, సత్య, తేజ, జ్యోతి వహీద్,అంబిక, అనిల్, సరిత, గిరిజ, జాన్, శివబాబు, హేమలత పాల్గొన్నారు.

నక్సలిజాన్ని రూపుమాపి దేశాన్ని కాపాడుకుందాం

సమావేశంలో మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ, మాజీ డీజీపీ అరవిందరావు

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో నక్సలిజాన్ని రూపుమాపి దేశాన్ని కాపాడుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. తద్వారా దేశ యువత, సైనిక బలగాలు, పౌరులను నక్సలిజం పేరు మీద జరిపే మారణ హోమం నుంచి రక్షించుకోవచ్చు అని అభిప్రాయపడ్డారు. మార్టేర్స్ మెమోరియల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (అమరవీరుల స్మారక పరిశోధన సంస్థ) (ఎంఎంఆర్ఐ) ఆధ్వర్యంలో చేంజింగ్ కలర్స్ ఆఫ్ నక్సలిజం అనే అంశంపై ఒకరోజు సదస్సును నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీలోని పీజీఆర్ఆర్ సీడీఈ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా లోక్ సత్తా జయప్రకాష్ నారాయణ, మాజీ డీజీపీ అరవింద్ రావు, మాజీ ఐఏఎస్ దాసరి శ్రీనివాసులు, సామాజిక సమరసత అఖిల భారత సంయోజక్ శ్యాంప్రసాద్, నెహ్రూ యువ కేంద్ర మాజీ ఉపాధ్యక్షులు పేరాల శేఖర్ రావు, ఎంఎంఆర్ఐ అధ్యక్షులు పుట్టి మురళీ మనోహర్, కార్యదర్శి రంజిత్ మోహన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల భారత హోం శాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ 2026 మార్చి నెల వరకు దేశంలో నక్సలిజం అంతం చేస్తామని అన్నారని గుర్తు చేశారు. కాని నక్సలైట్లు వారి రంగు మార్చుకొని అర్బన్ నక్సలైట్ల పేరు మీద పట్టణాల్లో తిష్ట వేశారని ఆరోపించారు.

సదస్సులో మాట్లాడుతున్న పీఓడబ్ల్యూ నాయకురాలు సంధ్య